క్లుప్తంగా

సహస్ర దీపారాధన



స్వామి వారి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన చేసినానంతరం యాగశాలలో విశేషహోమాలు చేశారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపం వద్దకు తీసుకువెళ్లి అక్కడున్న ప్రత్యేక ఊయలలో ఆశీనులను చేశారు. ఆ తర్వాత సహస్ర దీపాలు వెలిగించి ఆ దీపాలకాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయివిజయలక్ష్మి

విజయనగరంఫోర్ట్: స్థానిక పట్టణంలోని కళాశాల విద్యార్థినుల వసతిగృహంలో మహిళల రక్షణ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయివిజయలక్ష్మి మాట్లాడుతూ బాలలు, విద్యార్థులు, మహిళలంతా వారి రక్షణ కోసం ఉన్న చట్టాలు, హక్కుల గూర్చి తెలుసుకోవాలని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే వన్‌స్టాప్ సెంటర్ పని చేస్తోందని, ఎవరికి ఏ కష్టం వచ్చినా సెంటర్‌ను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ ఫెసిలిటేషన్ ఆఫీసర్ శోభారాణి, కౌన్సిలర్ రమాదేవి తదితరలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులు



సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విజయనగరం గంటస్తంభం: నగర పరిధిలోని రామకృష్ణనగర్‌లో కామ్రేడ్, సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రజాపోరాటంలో ఆయన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరం ఆయన ఆశయ సాధనకు పోరాటం చేయాలని అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎం.శాంతమూర్తి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

విజయనగరంఫోర్ట్: గోమాంసం విక్రయానికి లైసెన్స్‌లు మంజూరు చేసిన మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక గోసంరక్షణ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఆవు మాంసం విక్రయదారులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పైడిరాజు, సంధ్యారాణి, తాతారావు, అప్పలనాయుడు, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీపైడితల్లి అష్టోత్తర శతనామావళి కరపత్రాలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ఆవిష్కరించారు. వాగ్దేవీ సమారాధనం సంస్థ వ్యవస్థాపకురాలు, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవిలు ఈ అష్టోత్తర శతనామావళిని రూపకల్పన చేశారు. భక్తులకు సులభంగా అమ్మను పూజించేందుకు దీనిని రూపొందించామని వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

- సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వంపై మండిపాటు
- తక్షణమే డీఏ విడుదల చేయాలని డిమాండ్



విజయనగరం అర్బన్: తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వంపై నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ నెల 17వ తేదీ వరకు ఏపీటీఎఫ్ నేతృత్వంలో జరిగే ఈ నిరసన కార్యక్రమంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాల వద్ద ఉపాధ్యాయుల ఆందోళన జరిగింది. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులంతా తమ ప్రధాన డిమాండ్లను లేవనెత్తారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలి, సీపీఎస్ రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం ఇదే విషయమై హెచ్‌డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు కర్రి రవి, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, విజయకుమార్, వెంకటరావు, సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పెండింగ్‌లోని డీఏలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అంపోలు రాంబాబు, తిరుమలరెడ్డి శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీకాంత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నెంబరు 57 తక్షణమే అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పతివాడ త్రినాథ్, ఎం.రామకృష్ణ, పీఆర్‌టీయూ నాయకులు మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులు



నెల్లిమర్ల: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.బుకారి బాబు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పూసపాటిరేగ తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లోని నాలుగు డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, జీవో 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, అలాగే యాప్‌లు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలు రద్దు చేసి బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇది ఎంతమాత్రం తగదన్నారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు.

పెట్రోల్ కల్తీపై రగడ



బంకు మేనేజర్‌తో వినియోగదారుని వాగ్వాదం



పెట్రోల్‌లో నీరు కలిసిందని చూపిస్తున్న వినియోగదారుడు

భోగాపురం: స్థానిక బీపీసీఎల్(భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్)బంకు వద్ద పెట్రోల్ కల్తీపై శుక్రవారం రగడ(గొడవ) చోటుచేసుకుంది. విశాఖపట్నం జిల్లా, తగరపువలస గ్రామానికి చెందిన సీహెచ్ గోపి..స్థానిక లెండి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే ఆయన తన బైకుపై కళాశాలకు వెళ్లి విధుల అనంతరం తిరిగి సాయంత్రం ఇంటికి బయలుదేరారు. ఇంతలో బైకులో పెట్రోల్ అయిపోవడంతో స్థానిక భారత్ పెట్రోలియం బంకు వద్దకు వెళ్లి రూ.520ల పెట్రోల్ పోయించాడు. ఆ తర్వా బంకు నుంచి కొద్దిదూరం వెళ్లేసరికి బైకు మొరాయించింది. దీంతో బంకు సమీపంలోని మెకానిక్‌కు చూపించగా, వాహనాన్ని చూసిన మెకానిక్.. నీరు కలిసిన పెట్రోల్ ఇంజిన్‌లోకి చేరడం వల్ల ఇలా జరిగిందని చెప్పాడు. దీంతో గోపి..బంకు సిబ్బందికి విషయం తెలియజేశాడు. బంకు మేనేజర్ విజయ్‌కృష్ణ పెట్రోల్ ట్యాంకు నుంచి బాటిల్‌లోకి పెట్రోల్ తీసి చూడగా పెట్రోల్‌తో పాటు నీరు కూడా కనిపించింది. దీంతో గోపి స్థానికులతో కలిసి బంకు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇలా కల్తీ పెట్రోలు విక్రయించడమేంటని నిలదీశారు. వాహనం పాడైందని పరిస్థితి ఏంటని అడిగారు. గతంలో కూడా ఇదే బంకులో భోగాపురానికి చెందిన ఒక వ్యక్తి 70 లీటర్ల డీజిల్ కేన్‌లలో పోయించుకుని తీసుకువెళ్లాడని, ఆ డీజిల్‌లో కూడా 20 లీటర్ల వరకు నీరు ఉందని అప్పట్లో కూడా ఆందోళన చేయడం జరిగిందని స్థానికులు గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పెట్రోల్ బంకుల నిర్వహణపై దృష్టిసారించాలని, కల్తీ లేని పెట్రోలు, డీజిలు అందించేలా చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోండి

విజయనగరం టౌన్: ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ అందిస్తున్న ప్రత్యేక ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు సాయికుమార్, చందన్‌కుమార్‌లు ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. రాయల్ రాజస్థాన్ టూర్‌ను అక్టోబరు 9 నుంచి 18 వరకు..ఎల్‌టీసీ అండమాన్ ఎమరాల్డ్స్ టూర్‌ను నవంబరు 20 నుంచి 25 వరకు ఎయిర్ ప్యాకేజీల ద్వారా అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాజస్థాన్ టూర్‌లో జైపూర్, బికనీర్, జైసల్మీర్, జోద్‌పూర్, ఉదయ్‌పూర్, మౌంట్ అబు, పుష్కర్, అజ్మీర్‌ల పర్యటన ఉంటుందన్నారు. ఎల్‌టీసీ అండమాన్ టూర్‌లో పోర్ట్‌బ్లెయిర్, రాస్, నార్త్‌బే ఐలాండ్, హోప్‌లాక్, నీల్ ఐలాండ్ పర్యటనలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు9281030748, 9281495847ను సంప్రదించాలన్నారు.

సూపరింటెండెంట్‌ను కలిసిన ఐఎంఏ బృందం



సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

విజయనగరంఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజను ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రతినిధి బృందం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, డాక్టర్ జయధీర్‌బాబు, డాక్టర్ శంకర్‌రావు, డాక్టర్ పీఏ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ చట్టం ఎప్పుడు చేస్తారు?



వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

విజయనగరం టౌన్: బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక కలెక్టరేట్ డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోని బీసీల రక్షణకు ఎస్సీ, ఎస్టీల తరహాలో రక్షణ చట్టం తీసుకువచ్చి అమలు చేయాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సమయంలో హామీ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే చట్టసభల్లో కూడా 33 శాతం స్థానికసంస్థల నామినేటేడ్ పదవులు, నామినేషన్ వర్కుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మరో హామీ కూడా ఇచ్చారన్నారు. ప్రత్యేక నోడల్ ఏజెన్సీల ద్వారా సక్రమంగా నిధులు ఖర్చయ్యేలా చూడాలని, బీసీల సాధికారతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు పాల్గొన్నారు.

పేదవారికి సాయిట్రస్ట్ ద్వారా సేవలు



ఆస్పత్రిలో కోలుకుంటున్న వృద్ధురాలితో డాక్టర్ శ్రీరామ్మూర్తి

విజయనగరంఫోర్ట్: పేద, మధ్య తరగతి వర్గాల వారికి సాయిట్రస్ట్ ద్వారా వైద్య సేవలందించాలని సాయి సూపర్ స్పెషాలిటీ ఎండీ డాక్టర్ ఎ.శ్రీరామ్మూర్తి తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెంటాడ మండలం, కుంటినవలస గ్రామానికి చెందిన వృద్ధురాలు సింహాచలానికి ఇటీవల అతి తక్కువ ఖర్చుతో క్రిటికేల్ కేర్ చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. సింహాచలం శ్వాసకోశ వ్యాధితో పాటు తీవ్రమైన రక్తహీనతతో ప్రాణపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరిందని, ఆమెకు వెంటిలేషన్ కల్పించి రక్తం ఎక్కించి 10 రోజుల పాటు ఆస్పత్రిలోనే చికిత్స అందించి ప్రాణాలు కాపాడామన్నారు. కార్యక్రమంలో వైద్యులు మాధురి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జొన్నాడ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

డెంకాడ: రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విజయనగరంలోని విజ్జి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఫుల్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. ఎంపికైన వారిలో జి.జయ, జి.ధనలక్ష్మి, ఎ.యశస్విని, జి.సుప్రియ తదితరులు ఉన్నారు. వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

జరజాపుపేట విద్యార్థులు..

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు ఎల్.నితిన్, బి.ధనుష్ పాల్గొని విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మజ్జి తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కామేశ్వరి, పీడీ తిరుపతిరావు

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులకు డైట్ అధ్యాపక బృందం

నెల్లిమర్ల: స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్-2025 పోటీలు శుక్రవారం ముగిశాయి. ఐదు అంశాల్లో చేపట్టిన పోటీల్లో 16 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో ఉత్తరాంధ్ర ప్రాంత కళలు ప్రదర్శించడం జరిగిందన్నారు. రిటైర్డ్ ఎంఈవో ఈపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వికసిత్ భారత్ 2047 థీమ్‌ను పోటాపోటీగా ప్రదర్శించారన్నారు. చిన్నారుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుందన్నారు. కళా ఉత్సవ్ నోడల్ అధికారి వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం నలుమూలల నుంచి పోటీలకు విద్యార్థులు రావడం సంతోషంగా ఉందన్నారు. అక్టోబర్ 23, 24 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర పోటీల్లో ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారు పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైట్ సూపరింటెండెంట్ కమలకుమారి, ఫ్యాకల్టీ రమేష్, సూరిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ జేఏసీ నాయకులు

విజయనగరంఫోర్ట్: విద్యుత్ సంస్థలో దీర్ఘకాలంగా నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ జేఏసీ నాయకులు సురగాల లక్ష్మణ్, బండారు రాజేష్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్‌ఈ మువ్వ లక్ష్మణరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీ నుంచి దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించడం, 17, 18 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలు, జిల్లా కేంద్రంలో 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 22వ తేదీన జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం అందివ్వడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇవన్నీ చేసిన తర్వాత కూడా ప్రభుత్వం, ట్రాన్స్‌కో మేనేజ్‌మెంట్ స్పందించకపోతే నిరవధిక సమ్మెకి విద్యుత్ ఉద్యోగులంతా సిద్ధమన్నారు. కార్యక్రమంలో పి.అప్పలస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



నెల్లిమర్ల రూరల్: భక్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అర్చకులు

పూసపాటిరేగ: బాల్యవివాహాలతో అనర్థాలెన్నో ఉన్నాయని, వాటి నిర్మూలనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని భోగాపురం ఐసీడీఎస్ పీవో లావణ్య కోరారు. స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల కారణంగా పుట్టబోయే బిడ్డలు అంగవైకల్యంతో జన్మిస్తున్నారని, ఆడపిల్లలకు ఏదైనా ఆపద వస్తే 1098 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలి తెలిపారు. అనంతరం లింగవివక్ష, యుక్త వయసులో ఉన్న పిల్లల్లో రక్తహీనత సమస్యలు అధిగమించడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో భక్తులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. యూత్ క్లబ్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ చిన్న వయసులో బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చిన్నప్పుడే పెళ్లిళ్లు చేస్తే వారు చదువుకు దూరమై నరకం అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో ప్రతినిధులు ఝాన్సీరాణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో లావణ్య

14న ఈపీఎఫ్ పెన్షనర్ల సదస్సు



మాట్లాడుతున్న ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం నాయకులు

నెల్లిమర్ల: స్థానిక కార్మిక సంఘం భవనం ఆవరణలో ఈ నెల 14వ తేదీన ఈపీఎఫ్ పెన్షనర్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు ఎం.పాపారావు, కె.రామారావు తెలిపారు. ఇదే విషయమై జరజాపుపేటలో శుక్రవారం పెన్షనర్లతో సమావేశం నిర్వహించి, సదస్సుకు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, వాటిని మనం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కనీస పింఛన్ రూ.9 వేలు చేయాలని 11 ఏళ్లగా పోరాడుతున్న కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. పెన్షన్ పెంచే విషయంలో జాప్యం తగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కనకల పద్మనాభం, కాళ్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

